

ఆదమరిస్తే అంతే..


మెయిన్ రోడ్డుపై ఇసుక ఉన్న దృశ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట నుంచి గోకవరం వెళ్ళే ఆర్ అండ్ బి రోడ్డులో ఇసుక పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. జగ్గంపేట శివారు పోలవరం కాలువ బ్రిడ్జిపై నుంచి నీరు దిగువ ప్రాంతంగా ఉన్న జగ్గంపేట వైపు నీరు ప్రవహించింది. దీంతో కాళ్ళాణ మండపం ప్రాంతంలో నీటి నిల్వ అయింది. నీటితో కొట్టుకొచ్చిన ఇసుక అక్కడే ఉండిపోయింది. రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించకపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. తక్షణమే రోడ్డుపై ఇసుకను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెను ఉధృతం చేశారు. వందలాది అంగన్‌వాడీలు రోడ్లపైకి వచ్చారు. ప్రభుత్వం పట్ల నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగొచ్చేవరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. వారి సమ్మెకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. పలు కార్మిక, ప్రజా సంఘాలతో పాటూ టిడిపి, జనసేన నాయకులు సైతం సమ్మె శిబిరాలకు వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు.


ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి రెండో రోజుకు చేరింది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆయా మండల కేంద్రాల్లో తహశీల్దార్, ఎంపిడిఒ, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినదించారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు సిపిఎం, టిడిపి, జనసేన పార్టీలతోపాటు, ప్రజా సంఘాలు మద్దతునిచ్చాయి. సమస్యలు పరిష్కరించాలని, హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండోరోజూ కొనసాగింది. కాకినాడ ఇంద్రపాలెం లాకులు వద్ద, కాకినాడ అర్బన్‌లో సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ ప్రారంభించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని వీడి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ ధర్నా శిబిరాన్ని జనసేన పార్టీ కాకినాడ రూరల్ నాయకులు పంతం నానాజీ, మాజీ మేయర్ సుంకర పావని, టిడిపి నాయకులు, తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, నేషనల్ వికలాంగుల సంఘం నాయకులు సిహెచ్ సుబ్బారావు, వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎం.పాపిరెడ్డి, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షులు తోట సుధీర్, టిడిపి కాకినాడ మహిళా విభాగం అధికార ప్రతినిధి మీసాల సునీత, పి.లక్ష్మీప్రసన్న మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కాకినాడ ప్రాజెక్టు నాయకురాలు ఎమ్‌కె.జ్యోతి, జిల్లా కోశాధికారి రమణమ్మ, రమ, నీరజ, మున్ని, సరోజ, జోగమ్మ తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించమని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.శేషాబాబ్జి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌దవాడీ నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు పిలిచి సమ్మెను ఆపకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. ఇటువంటి బెదిరింపులకు అంగన్‌వాడీలు భయపడేది లేదన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు సిపిఎం నాయకుడు కోనేటి రాజు, మాజీ ఎంఎల్ఎ వర్మ సతీమణి లక్ష్మి దేవి, కౌన్సిలర్ అన్నపూర్ణ, ఆర్.భాస్కరరావు, బిజెపి నాయకులు, ఐలు జిల్లా నాయకులు జిఎస్.భాస్కర్ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో విజయశాంత, కమలారాణి, ప్రజా శాంత, బేబీ, సూర్యకాంతం, నళిని పాల్గొన్నారు. **రౌతులపూడి** అంగన్‌వాడీల నిరవధిక సమ్మె బుధవారానికి రెండో రోజు చేరుకుంది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో యూనియన్ సెక్టార్ నాయకురాలు రాజేశ్వరి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే నిరవధిక సమ్మెను ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ హక్కులను సాధించుకునేంత వరకూ సమ్మెను విరమించేది లేదని అన్నారు. **కాజులూరు** స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ నాయకులు వరలక్ష్మి, హనుమావతి, అన్నవరం మాట్లాడారు. డిమాండ్ల పరిష్కరించేంత వరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు సిపిఎం మండల కన్వీనర్ వల్లు రాజబాబు, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, దేగల వెంకట సతీష్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు మామిడి ప్రసన్న, జొన్నలగడ్డ సరోజినీ, సలాది లక్ష్మి, నందికోళ్ల నాగమణి, శేషారత్నం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్‌లో అంగన్‌వాడీల ఆందోళన కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీల పోరాటానికి సిపిఎం, జనసేన పార్టీలు మద్దతు ప్రకటించాయి. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి మాట్లాడారు. సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, సిరపరపు శ్రీనివాస్ శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాడి బేబీ, తలారి నాగమణి, అమల, ఫాతిమా, ఎస్తేరు రాణి, వరలక్ష్మి, జె కుమారి, తదితరులు పాల్గొన్నారు. **యు. కొత్తపల్లి** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం కార్యదర్శి అప్పారెడ్డి ధర్నా శిబిరంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ నాయకులు సాంబశివరావు, మి డే మీల్స్ వర్కస్ నాయకులు కె. నాగేశ్వరరావు, డి.అన్నపూర్ణ, ఒ.సత్యవతి, జి ఆనంద్, బేబీరాణి పాల్గొన్నారు. **కరప** తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి రాంప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. కాకినాడ రూరల్ అధ్యక్షురాలు, కరప సెక్టర్ నాయకురాలు పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి మాట్లాడారు. అంగన్‌వాడీల ధర్నాకు జనసేన పార్టీ నాయకులు భోగి రెడ్డి కొండలరావు, భోగిరెడ్డి గంగాధరరావు, వీర వెంకట సత్యనారాయణ, పేకేటి ప్రసాద్, పేపకాయల శ్రీనివాస్, సిపిఎం నాయకులు ఎం.రమణి, విఒఎ సంఘం నాయకులు పద్మ, శ్రీదేవి సత్య, జిల్లా యుటిఎఫ్ ఆడిట్ కమిటీ అధ్యక్షుడు పి.రాజబాబు, యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కెవి.నాగేశ్వరరావు, కురుపూడి వెంకటరమణ, స్థానిక యూటిఎఫ్ నాయకులు వై.శ్రీనివాసరావు, తేజ, పి.రాజబాబు, సత్యనారాయణ, 108 యూనియన్ నాయకులు త్రిమూర్తులు, భవన నిర్మాణ కార్మికుల నాయకులు కె.సురేష్ తదితరులు సమ్మెకు మద్దతు ప్రకటించారు. **తాళ్లరేవు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల ధర్నా కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, ఆశ వర్కర్ల అధ్యక్షులు పి. అనంతలక్ష్మి, ఐద్వా రాష్ట్ర నాయకులు సిహెచ్.రమణి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు దుప్పి అదృష్టదీపుడు, ఎం.తణుకురాజు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబురావు, యుటిఎఫ్ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు బి.పద్మజ, ఎన్.కృష్ణవేణి, జి.పార్వతి, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా కొనసాగింది. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఇ. చంద్రావతి పాల్గొని మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ కెవిపి.సత్యనారాయణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు రాజేశ్వరి, నాయకులు వీరలక్ష్మి, జగదీశ్వరి, దేవి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల ధర్నాకు టిడిపి అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పోలినాటి ధర్మానంద కుమారి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి మహిళ అధ్యక్షురాలు నకిరెడ్డి సూర్యవతి, ఉపాధ్యక్షురాలు గుమ్మళ్ళ అనంతలక్ష్మి, జగ్గంపేట టిడిపి టౌన్ అధ్యక్షురాలు గెద్దాడ సత్యవేణి, తిప్పన సత్యవతి, అంగన్‌వాడీ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి బండి సుజాత, సెక్టార్ లీడర్ అల్లం గంగాభవాని, బి.రామలీల, ఎస్.చంటమ్మ, వైవి.కృపాభాయ్, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండల కేంద్రమైన ఏలేశ్వరంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వివి.రమణ, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ జిల్లా నాయకులు ఆర్.రామలింగేశ్వర రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రసాద్, పతిపాడు మండల సిఐటియు కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు అల్లాడి లక్ష్మి, కాకరపల్లి సునీత, హేమలత, టి.నాగ వరలక్ష్మి, మరియ, నూకరత్నం గంగాభవాని, కె.అచ్చిరాజు పాల్గొన్నారు.


కాకినాడలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, మద్దతుగా పాల్గొన్న జనసేన పార్టీ నాయకుడు పంతం నానాజీ


పిఠాపురం ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి


తాళ్లరేవు సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు


జగ్గంపేటలో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న టిడిపి మహిళా నాయకురాళ్లు

వైసిపితోనే పేదలకు సంక్షేమ పాలన

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపితోనే ప్రజలకు సంక్షే మ పాలన సాధ్యమని రాష్ట్ర హౌసిం గ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో బుధవారం వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమం జరిగిం ది. పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 2024లో జరిగే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరి బాబు, వైస్ ఎంపిపి కంటే ప్రభావతి, రాష్ట్ర కార్యదర్శి కంటే వీరరాఘవరావు, పంచాయతీ కార్యదర్శి కళ, నాయకలు ఆవాల లక్ష్మీనారాయణ, ఊబా జాన్ మోసెస్, గోపు మురళి పాల్గొన్నారు.

మల్లేపల్లిలో భారీ అన్నదానం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం మల్లేపల్లి, కొత్తూరు రామాలయాల వద్ద కార్తీకమాసం చివరి రోజున భారీ అన్నదానం కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా రామకుర్తి సత్యనారాయణ గురువు, చింతా అరుణ కుమార్ శర్మ, వైష్ణవుదాసు నాగేశ్వరరావు లకు, వెలిది సుబ్రహ్మణ్యం పార్వతి, మల్లా బత్తుల వీర చక్రం తులసమ్మ దంపతుల చేతుల మీదుగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడబాల సూరిబాబు, వెలిది వెంకటేశ్వరరావు, రావిపాటి నాగేశ్వరరావు, చింతపల్లి వీరభద్రరావు, గొల్లవిల్లి విష్ణు, దిడ్డి బాబురావు, ఉనమంట్ల శ్రీను, వెలిది బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

తేలుతున్న పంట నష్టం

ప్రజాశక్తి - యంత్రాంగం

తుపాన్ ప్రభావం మిగిల్చిన పంట నష్టం లెక్కలు తేలుతున్నాయి. గత రెండు రోజులుగా జిల్లాలోని వివిధ మండలాల్లో అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నారు. రైతులు, అధికారులు బృందంగా ఏర్పడి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలిసి పంట నష్టంను లెక్కిస్తున్నారు. **సామర్లకోట రూరల్** మండల పరిధిలో తుపాన్ ప్రభావంతో సుమారు 835 హెక్టార్ల పరిధిలో వరి పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి ఇమ్మిడిశెట్టి సత్య తెలపారు. క్షేత్ర స్థాయిలో నష్టం లెక్కింపు బృందాలు సర్వే చేస్తున్నాయని తెలిపారు. మండలంలోని ఉండూరులో నిర్వహించిన సర్వేలో 120 ఎకరాల్లో పంట నష్టంను జరిగినట్లు బృందం గుర్తించింది. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా పంట నష్టం సర్వే నిర్వహిస్తున్నట్లు ఎఒ సత్య వివరించారు. **ఏలేశ్వరం**పూర్తి పారదర్శకతతో రైతన్నలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అంచనాలు రూపొందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిని బి.జ్యోతి తెలిపారు. మండలంలోని జె.అన్నవరం, మర్రివీడు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీలోగా పంట నష్టం రూపొందించి నష్టపోయిన రైతులు జాబితాను ఆయా ఆర్‌బికె కేంద్రాల్లో ప్రదర్శిస్తామని చెప్పారు. 18 నుంచి 22లోగా ఆ జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలన్నారు. వరి పంట నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ.17 వేలు, అరటి పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు ప్రభుత్వం అందించనున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతోపాటు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **రౌతులపూడి** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వివిధ ప్రాంతాల్లో 510 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారి ఈశ్వరరావు బుధవారం తెలిపారు. క్షేత్రస్థాయిలో పంట నష్టం గుర్తించడం జరుగుతుందని, నష్టపోయిన రైతులు ఆయా గ్రామ సచివాలయాలకు భూముల సంబంధించిన రికార్డులను అందజేయాలని ఆయన తెలిపారు. **జగ్గంపేట రూరల్** ఇటీవల సంభవించిన తుపాన్ ప్రభావంతో మండలంలో 18 గ్రామాల్లో వరి పంట నష్టం వాటిల్లింది. జగ్గంపేట మండల వ్యవసాయాధికారి శ్రీరామ్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 2 వేల హెక్టర్లలో పంట నష్టం సంభవించిందన్నారు. క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 18లోగా పంట నష్టంపై సర్వే పూర్తికానుందని, గ్రామ స్థాయిలో సర్పంచ్, కార్యదర్శి, విఎఎ, విఆర్‌ఒలతో పంట నష్టం పరిశీలించేందుకు కమిటీ వేసినట్లు తెలిపారు.


సామర్లకోటలో క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న తాడి బాబ్జి

ప్రజాశక్తి - పెద్దాపురం

అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర నాయకులు తాడి బాబ్జి, ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ భవనంలో బుధవారం జరిగిన దళితుల ఐక్యతా సభలో వారు మాట్లాడుతూ రాజకీయ నాయకులు దళితులను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవటం తప్ప దళితుల అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. దళిత కుటుంబాలు విద్యావకాశాలన్నింటినీ సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. స్థానిక పరిశ్రమల్లో దళితులకు ఉపాధి కల్పించాలన్నారు. స్థానిక నాయకులు గుర్రాల యాకోబు, ఆరేళ్ల వీరరాఘవ, జాలా దావీదు, పెద్దింటి మరిడియ్య, బేదంపూడి సత్తిబాబు, కేటి శ్రీను, తలారి ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఇవిపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యారెడ్డిలు పిలుపునిచ్చారు. మండలంలోని ఉండూరు, కాపవరం గ్రామాల్లో బుధవారం గ్రామ సర్పంచ్‌లు సత్యాడి ధనలక్ష్మి, కుంచం మాధవరావుల అధ్యక్షతన వికశిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బి విశ్వేశ్వరరావు, శ్రీరాంకుమార్, వి.వెంకటరమణ, ఎంఇఒ-2 పి.పుల్లయ్య, అధికారులు జి.పద్మరూప, ఇమ్మిడిశెట్టి సత్య ం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇవిపిఆర్‌డి

కొండపోడు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని 1350 మంది లబ్ధిదారులకు 1650 ఎకరాలు కొండపోడు భూములకు సంబంధించి పట్టాలు పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని ఎం.చమవరం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భీమారావు, సర్పంచ్ అడపా సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఈ నెల 15 నుంచి సచివాలయాల స్థాయిలో చేపట్టే ఆడుదాం ఆంధ్రా ఆటలపోటీలను సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఉండూరు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మండలంలోని పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, పిఇటిలు, మాస్టర్ ట్రైనీలతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహణ, విజేతల ఎంపిక తదితర అంశాలను వివరించారు. ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎంఇఒ-2 పి.పులయ్య పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కార్టూ'నిజం'



సంస్కరణాలయాలకి తమరు ఎన్నిసార్లు వెళ్లొచ్చారు సార్..!

సేవాతత్పరుడు డాక్టర్ అడ్డాల


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ దంపతులు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సామాజిక కార్యకర్తగా, దంత వైద్యుడిగా పేదలకు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ సేవా తత్పరుడని విశ్రాంతి ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక ఎపిఐఐసి కాలనీ అడబాల ట్రస్ట్ కార్యాలయంలో సత్యా డెంటల్ క్లినిక్ 25వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ అడ్డాల 25 మంది వృద్ధులకు నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఏ స్వచ్ఛంద సేవా సంస్థ అయినా ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలంటే దానికి పూర్తి సహకారం అందించి విజయవంతం చేసేది డాక్టర్ అడ్డాల అని అన్నారు. డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ దంత వైద్య రంగంలో వస్తున్న ఆధునికతను ఎప్పటికప్పుడు ఆచరిస్తూ అందరికీ అందుబాటులో దంత వైద్యం తీసుకురావాలన్నదే తన లక్ష్యమని అన్నారు . అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ అడ్డాల దంపతులను ఘనంగా సత్కరించారు.

చిల్లర వేషాలు మానుకుంటే మంచిది

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



పార్టీ ముసుగులో చిల్లర వేశాలు మానుకుంటే మంచిదని రాష్ట్ర డాక్టర్స్ వింగ్ మాజీ ఛైర్మన్ పితాని అన్నవరానికి జడ్‌పిటిసి నురుకుర్తి రామ కృష్ణ(కిట్టు) సలహా ఇచ్చారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయు ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా ఎంఎల్ఎ కురసాల కన్నబాబును అగౌరవపర్చేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న అన్నవరం కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేరని అన్నారు. అటువంటి వ్యక్తి రెండు పర్యాయాలు ఎంఎల్ఎగా, మంత్రిగా, వైసిపి జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్న కన్నబాబుపై చేస్తున్న చిల్లర వ్యాఖ్యలు బాధాకరమన్నారు. పితాని ఇతర పార్టీల కు కోవర్టుగా పనిచేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, వైసిపి ముసుగులో సేవా కార్యక్రమాలపేరుతో ప్రజలను మభ్య పెడుతున్నారని ధ్వజమెత్తారు. పార్టీ ప్రతిష్టకు భంగం కల్గేలా వ్యవహరిస్తున్న పితాని అన్నవరంపై పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పితానిపై చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామన్నారు. .

ఆన్‌లైన్ వ్రతాలతో రూ.36.63 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - అన్నవరం

కార్తీకమాసంలో ఆన్‌లైన్ వ్రతాల ద్వారా వీర వెంకట సత్యనారాయణ దేవస్థానానికి రూ.36,63,500 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం పర్యవేక్షణ అధికారి ఐవి.రామారావు తెలిపారు. కొండపైకి వివిధ కారణాలతో రాలేని భక్తులు స్వామి వారి వ్రతాలు, కళ్యాణాలు నిర్వహించుకునేందుకు టెక్నాలజీని దేవస్థానంలో ప్రవేశపెట్టారు. ఈ సౌకర్యంతో భక్తులు కార్తీక మాసం నెల రోజుల్లో రూ.300, రూ.1000, రూ.1500, రూ.2000 తరగతుల వారీగా 3,141 వ్రతాలు నిర్వహించారని ఆయన 'ప్రజాశక్తి'కి తెలిపారు.

రైతులను పూర్తిగా ఆదుకోవాలి


పాడైపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి చిక్కాల

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పంట నష్టపోయిన రైతు లను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలం లోని ఎర్రవరం గ్రామంలో టిడిపి నియో జకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభతో కలిసి నీట మునిగిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో వరి పనలు మొలకలు వచ్చి, ధాన్యం గింజలు కుళ్ళిపోయాయని అన్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి పండించిన పంట నీళ్ళ పాలు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇంతటి నష్టం జరిగినా సిఎం జగన్ రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. చంద్రబాబు హయాంలో తుపాన్ వంటి సంక్షోభ సమయాల్లో ప్రభుత్వం ఎలా స్పందించిందో ఒక్కసారి రైతులు గుర్తు చేసుకోవాలన్నారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు మెట్ల రమణబాబు, బోళ్ల వెంకటరమణ, ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని గంటావారిగూడెంలో 16వ నెంబరు జాతీయ రహదారిలోని వంతెన వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై మతిస్థిమితం లేని వ్యక్తి నడిచి వెళుతూ ఉండగా విజయవాడ వెళుతున్న లారీ ఢీకొట్టి, అదుపుతప్పి జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో పాదచారి అక్కడికక్కడే మృతి చెందగా లారీ డ్రైవర్, క్లీనర్లకు గాయాలు అయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని నల్లజర్ల పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న 15 మంది అరెస్టు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి గ్రామ పరిధిలో పేకాడుచున్న 15 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. వారి నుంచి రూ.35,060 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఉండ్రాజవరానికి చెందిన పెద్ద కామేశ్వరరావు మంగళవారం ఒక బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచారు. నిందితునికి ఈనెల 27వరకూ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కె.రామారావు తెలిపారు. సంఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితునికి రిమాండ్ విధించేలా విధులు నిర్వర్తించిన ఎస్ఐను ఎస్‌పి అభినందించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ముగ్గళ్లలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించిన సారావ విక్రయిస్తున్న గోరుముచ్చు వీరాస్వామి అలియాస్ మల్లారం అనే వ్యక్తిని అరెస్టు చేశామని కోరుకొండ ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ తెలిపారు. అతని నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందుతుడిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఆరు లారీలు ధ్వంసం

ప్రజాశక్తి-గోపాలపురం

ఆరు లారీలు ఒక దానికొకటి ఢీకొన్న ఘటన గోపాలపురం శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం శివారు జాతీయ రహదారిపై కొయ్యలగూడెం వైపుగా వెళ్లే దారిలో వే బ్రిడ్జి వద్ద రెండు లారీలు ఒకదాని ఒకటి ఢీకొన్నాయి. ఇందులో ఒకలారీ అదుపుతప్పి లంకలోకి వెళ్లిపోయింది. అక్కడ నుంచి అదే రోడ్డులో 100 మీటర్ల పరిధిలో మరొక నాలుగు లారీలు ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీలు ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేశారు.

వరకట్నం కేసులో జైలు శిక్ష

ప్రజాశక్తి - సీతానగరం

వరకట్నం కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. ఇనుగంటివారిపేటకు చెందిన గారపాటి ప్రశాంతి, సత్యనారాయణ భార్యాభర్తలు. వరకట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని 2019లో ప్రశాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం దోషిగా తేలడంతో సత్యనారాయణకు ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ 7వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి బాబు తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.



వైద్య సేవలందుకుంటున్న ప్రజలు

185 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -కరప

కరపలో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 185 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కెవివి.సత్యనారాయణ మాట్లాడారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి ఆహార నియామయాలు పాటించాలని, ప్రతిరోజూ వ్యాయామం, ప్రాణాయామం తప్పకుండా చేయాలని వైద్యులు మనోజ్, శ్రీనివాస్ సూచించారు. సుందరపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి



నాయుడుబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- కాకినాడ

విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఇటీవల ఆకస్మికంగా మరణించిన యువ పాత్రికేయుడు రెడ్డి నాయుడుబాబు సంతాప సభను కాకినాడ జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నాయుడుబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జర్నలిస్టులు నిరంతరం ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే మతి చెందిన రెడ్డి నాయుడుబాబు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. నాయుడు బాబుతో ఉన్న అనుబంధాన్ని జర్నలిస్టు మిత్రులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సుంకర పావని, జనసేన మహిళా నేత మాజీ మేయర్ సరోజ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

పిఠాపురంలో రైల్వే ప్రయాణికుల ఆందోళన

పట్టాలపై నిరసనతో నిలిచిన రైలు



పిఠాపురం రైల్వేస్టేషన్లో పట్టాలపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - పిఠాపురం

అయ్యప్పస్వామి మాలధారులు, ప్రయాణికులకు మధ్య జరిగిన వివాదంలో పిఠాపురంలో ఉద్రికత్తత నెలకొంది. రిజర్వేషన్ బోగీల్లో సైతం సాధారణ ప్రయాణికులు ఎక్కడంతో ఈ వివాదం నెలకొంది. సాధారణ ప్రయాణికుల ఎక్కడంతో అయ్యప్ప స్వామి భక్తులంతా ఏకమై వారిని కిందకి తోసేశారు. దీంతో వారంతా ఆందోళనకు దిగారు. రైలు ఇంజన్ ముందు ట్రాక్‌పై బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పలువురిని రైలు ఎక్కించే ప్రయత్నం చేశారు. ట్రైన్ అద్వానంగా మారుస్తున్నారని తమకు రిజర్వేషన్ ఉందని రిజర్వేషన్ లేని వాళ్ళని ఎలా ఎక్కిస్తారని అయ్యప్ప స్వాములు పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు వారిక సర్ది చెప్పి కొంత మందిని రైలు ఎక్కించారు. మిగిలిన వారిని ఇతర రైళ్లలో పంపించారు. సాధారణ భోగిల సంఖ్యను తగ్గించడంతో రైలులు అన్ని కిక్కిరిసి ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సాధారణ భోగిల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సమస్యలపై మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా



సమస్యలను పరిష్కరించాలంటూ ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ ఉపాధ్యాయులు బుధవారం ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ కాకినాడ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.సాయిరాం మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లోని అన్ని పోస్టులను అప్ గ్రేడ్ చేయాలన్నారు. పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సి.మూర్తి మాట్లాడుతూ 2022 జూన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు మున్సిపల్ యాజమాన్యం నుంచి పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి వచ్చాయన్నారు. యుటిఎఫ్ పోరాటం వల్ల కేడర్ స్ట్రెంత్ సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జయరాజు, బిఎన్.మధుకుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.కరుణాకర్, బిజె.కెనడీ, జిల్లా కార్యదర్శి పివి.సత్యనారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సిహెచ్.సతీష్ బాబు, గండేపల్లి, జగ్గంపేట, పెద్దాపురం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జెండాను ఆవిష్కరిస్తున్న గుబ్బల యేసురాజు

ప్రజాశక్తి - కాజులూరు

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని వైసిపి మండల అధ్యక్షుడు గుబ్బల యేసు రాజు అన్నారు. బుధవారం మండలంలోని పెదలంక గ్రామంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ చిరవూరి పార్వతి సత్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏసురాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ప్రతి కుటుంబానికి పథకాలు అందేలా సచివాలయం, వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైసిపి మరోసారి అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు వనుము వెంకట సుబ్బారావు, ఎంపిపి మాత భారతి మురళి, వైస్ ఎంపిపి రేకాడి విజయ ఫణీంద్ర, ఎంపిటిసి సభ్యులు పంపన పద్మావతి శ్రీనివాస్, సహకార సంఘ అధ్యక్షులు తొగరు చంద్రశేఖర్, గండి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కేన్సర్ వైద్య శిబిరం



ట్రస్ట్ అధినేత గుణ్ణం చంద్రమౌళిని అభినందిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట పూర్ణ కళ్యాణ మండపంలో రెండు రోజులుగా నిర్వహించిన కేన్సర్ మెగా వైద్య శిబిరం బుధవారంతో ముగిసింది. గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాదుకు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సౌజన్యంతో ట్రస్ట్ అధినేత గుణ్ణం చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. నిర్వాహకులు చంద్రమౌళి మాట్లాడుతూ ఈ శిబిరంలో 1,200 మందికి వైద్య సేవలు అందించామన్నారు. కేన్సర్ ప్రాణాంతక వ్యాధి కాదని, మందులతో నయమవుతుందని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహించామన్నారు. అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది వైద్య సేవలందించారన్నారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నందకిషోర్ నేతృత్వంలో హైదరాబాదు నుంచి రూ.7కోట్లు విలువచేసే అధునాతన వైద్య పరికరాలు గల రెండు బస్సులను ఈ వైద్య శిబిరం కోసం వినియోగించామని తెలిపారు.

చంద్రమౌళి కి పలువురి అభినందన

కేన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించిన ట్రస్ట్ అధినేత గుణ్ణం చంద్రమౌళిని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు. రెండో రోజు శిబిరాన్ని మాజీ ఎంఎల్‌ఎలు వనమాడి కొండబాబు, పిల్లి అనంతలక్ష్మి, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, రాష్ట్ర మున్సిపల్ కౌన్సిలర్ ఛాంబర్ మాజీ అధ్యక్షులు డా. గొరకపూడి చిన్నయ్య దొర, విజన్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహాన్నతు తదితరులు సందర్శించారు. భారత్ మాత సేవ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో వైద్యులకు, నిర్వాహకులకు సత్కారం చేశారు. జనసేన పెద్దాపురం నియోజకవర్గ యువత నాయకులు బిక్కిన రాజశేఖర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, టిడిపి మండల అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాదులు కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి పాల్గొన్నారు.

భీమేశ్వర ఆలయానికి పోటెత్తిన యాత్రికులు



భక్తులతో కిటకిటలాడుఉతున్న ఆలయం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోటలో భీమేశ్వర ఆలయానికి బుధవారం యాత్రికులు పోటెత్తారు. కార్తీక పోలి పాడ్యమి సందర్భంగా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షులు దవులూరి సుబ్బారావు పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు యాత్రికులు బారులు తీరారు. ఆలయ పుష్కరిణి, ఆలయ ఆర్చి వద్దగల గోదావరిలో స్నానాలాచరించారు. సామర్లకోట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వైసిపి రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా సానా



సిద్ధార్థ రెడ్డితో నాగు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

వైసిపి రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా కొత్తపల్లికి చెందిన సానా నాగు ఎంపికయ్యారు. యువజన విభాగం మొదటి రాష్ట్ర కార్యవర్గ సమావేశం తాడేపల్లి గ్రాండ్ ఫార్చ్యూన్‌లో జరిగింది. ఈ సమావేశంలో నాగును కార్యదర్శిగా యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, సిద్ధార్థ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉషోదయా మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు కావూరి శ్రీనివాస్ అధ్యక్షతన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సంతపేట లయన్స్ క్లబ్ హాల్లో బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి సభ్యులు సాగర్, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, బెంగుళూరు కెరీర్స్ ఇండియా సంస్థకు చెందిన సురేంద్ర, కెప్పయ్య, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులు చోడిశెట్టి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. వికలాంగులు ఆత్మస్థయిర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలను ఎంపిపి సునీత ప్రారంభించారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, జంపన రామభద్రరాజు, నాగరాజు, రాజబాబు దివ్యాంగుల సమాఖ్య నాయకులు సీతామహాలక్ష్మీ, గోవిందురాజు, శాంతి, తణుకు రాజు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం



రహిమున్నీషాబేగంను సత్కరిస్తున్న నిర్వాహకులు

కాకినాడ : వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం అవసరమని విశాఖ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు రహిమున్నీషాబేగం అన్నారు. బుధవారం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహనా కారయక్రమాన్ని నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ, పీడీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ నాయుడు మాట్లాడారు. కొనుగోలు, అమ్మకాలు, వస్తు ఉత్పత్తి, వినిమయం వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్లఓ కొనుగోలు ప్రక్రియ ఎక్కువైన తరుణంలో కొనుగోలుదారుడు హక్కుల గురించి, పరిరక్షణ కోసం చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జి మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కాశీకి మాజీ ఎంఎల్‌ఎ నెహ్రూ పరామర్శ



కాశీ తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - గండేపల్లి

మాతృ వియోగంతో బాధపడుతున్న టిడిపి గండేపల్లి గ్రామ అధ్యక్షులు యలమాటి కాశీని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం పరామర్శించారు. కాశీ తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో కాశి, అల్లుడు ఇప్పర్ల బాబిని నెహ్రూ పరామర్శించారు. కాశీ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, నాయకులు ఆళ్ల సత్యనారాయణ, ముంగర సూర్యారావు, వెంపాటి సతీష్, గరికిపాటి రమణ, వాసు, పిల్ల మోహన్, మహేష్ తదితరులున్నారు

అందరికీ సంక్షేమ లాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్రంలోని అందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలంటే మళ్లీ సిఎంగా జగన్మోహన్ రెడ్డి రావాలని ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. స్థానిక సచివాలయం 2 పరిధిలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని వివరించే ప్రదర్శన బోర్డును ప్రారంభించారు. అనంతరం చెరువుగట్టు సెంటర్లో వైసిపి జెండాను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కె.శివన్నారాయణ, జడ్‌పిటిసి సామ్యూల్ సాగర్, నాయకులు కె.నాగరాజు, కె.వెం కన్న, సిహెచ్.చలపతి, ఎన్. శ్రీమన్నారాయణ, ఆర్.ముత్యా లరావు, వి.రామకృష్ణ, దేవస్థానం ఛైర్మన్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -కరప

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి పి.శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం పెద్దాపురప్పాడు సచివాలయం వద్ద వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇఒపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యదర్శి డి.దుర్గాభవాని సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా పెంకే శ్రీలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు సిహెచ్.ఈశ్వరరావు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కె.వెంకటేశ్వరరావు, ఎన్.సత్తిబాబు, సర్పంచ్ బి. సరస్వతి ఎంపిటిసి పి.పద్మావతి, సర్పంచ్ వి.సీతారామరాఘవ, ఉప సర్పంచ్ బి.శారద, నల్లా బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిని నింపిన వికలాంగుల క్రీడోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

వికలాంగుల క్రీడోత్సాహం స్ఫూర్తిదాయకమని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ వ్యవస్థాపకులు సానా సతీష్‌బాబు అన్నారు. ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య 10వ వార్షికోత్సవ వేడుకల్లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలను బుధవారం కాకినాడలో నిర్వహించారు. ఈ పోటీలను సతీష్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. నా వైకల్యాన్ని అధిగమించి క్రీడల్లో తమ ప్రతిభను చాటుతున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య ప్రతినిధులు, సానా సతీష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



గౌతమి గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

శివం బాత్ వద్ద దీపారాధన

ప్రజాశక్తి - యానాం

కార్తీక మాసం చివరి రోజును పురస్కరించుకుని బుధవారం యానాం గౌతమి గోదావరి నది తీరాన శివం బాత్ వద్ద మహిళలు దీపారాధన చేశారు. తెల్లవారుజామున నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



క్యాంపునకు ఎంపికైన విద్యార్థులతో కో ఆర్డినేటర్ కృష్ణసుధాకర్

అడ్వెంచర్ క్యాంపునకు యానాం విద్యార్థులు

ప్రజాశక్తి - యానాం

హిమాచల్ ప్రదేశ్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే అడ్వెంచ్ క్యాంపునకు యానానికి చెందిన 8 మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఎంపికయ్యారు. ప్రతి సంవత్సరం నేషనల్ సర్వీస్ స్కీం అడ్వెంచర్ క్యాంపును నిర్వహిస్తుందని ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్ తెలిపారు. ఎనిమిది మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఒక ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్నికయ్యారని తెలిపారు. ఈ నెల 19 నుంచి 28 వరకు ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వాలంటీర్లలో నలుగురు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన వారు కాగా, మరో నలుగురు రీజెన్సీ జూనియర్ కళాశాలకు చెందిన వారని తెలిపారు. ఎస్కార్ట్‌గా సరెళ్ల వీరకుమార్ వెళ్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగ విద్యార్థులను ఆర్ఎఒ మునిస్వామి, పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగ అజ్మెరా, రీజెన్సీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్ అభినందించారన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా రెండవ రోజు బుధవారం స్థానిక సబ్ పోస్టల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎజిజిడిఎస్‌యు సర్కిల్ ఉపాధ్యక్షుడు పేపకాయల వీర్రాజు, ఎ సురేంద్రనాథ్ మాట్లాడుతూ డాక్ సేవక్‌లకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, గ్రామాల్లో పని చేసే వారికి 8 గంటల పని విధానం అమలు చేయాలని,పెండింగ్‌లో ఉన్న మరో ఐదు డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండవ రోజు డాక్ సేవక్‌ల సమ్మెతో బుధవారం గ్రామాల్లో తపాలా సేవలన్నీ నిలిచిపోయాయి. ఈ ధర్నాలో గ్రామీణ డాక్ సేవక్ లు పాల్గొన్నారు.